రామయ్యకు నిత్య కల్యాణం

రామయ్యకు నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 31: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం సీతారాములకు నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతం పలికి నిత్య పూజలు జరిపిన అనంతరం నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం నిర్వహించారు.

సన్నాహక సమావేశానికి తరలాలి

భద్రాచలం, జనవరి 31 : భద్రాచలంలో ఈ నెల 3న జరగనున్న ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశానికి అన్ని మండలాల బీఆర్ఎస్ శ్రేణులన్నీ తరలి రావాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పిలుపు నిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ మాలోత్ కవిత, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హాజరవుతున్నారన్నారు. అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తప్పక రావాలన్నారు. నాయకులు రావులపల్లి రాంప్రసాద్, అరికెల్ల తిరుపతిరావు, గంపా రాంబాబు, రాజీవ్, రత్నం రమాకాంత్, ఆకోజు సునీల్, పెద్దినేని శ్రీనివాస్, నాగేంద్రబాబు, కాపుల నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇల్లెందు రూరల్, జనవరి 31: 33/11 కేవీ సివిల్ లైన్ సబ్‌స్టేషన్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ రాము తెలిపారు. సత్యనారాయణపురం, బొల్లినగర్, 21ఫీట్, 24 ఏరియా, రాజీవ్‌నగర్, కొత్తబస్టాండ్, యన్‌జీవోస్ కాలనీ, ఎల్‌బీయస్‌నగర్, ఎల్లన్న గ్రౌండ్, బుగ్గవాగు, సబ్‌జైల్ ఏరియాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ద్విచక్రవాహనం చోరీ

అశ్వారావుపేట, జనవరి 31: ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణానికి చెందిన ఎస్‌కే అజీమ్ ద్విచక్రవాహనాన్ని గాంధీబొమ్మ సెంటర్‌లోని పాలకేంద్రం వద్ద మంగళవారం రాత్రి నిలిపి ఉంచాడు. తెల్లారి ఉదయం కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

వణికిస్తున్న చలి

కరకగూడెం, జనవరి 31 : మండల వ్యాప్తంగా వారం రోజుల నుంచి ఎముకలు కొరికే చలి తీవ్రత పెరిగింది. గజ గజా వణుకుతున్నారు. దీంతో ప్రజలు చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. ఉదయం 9.00 గంటల వరకు చలి ఎక్కువగా ఉండడంతో పాటు సాయంత్రం 6.00 గంటల తరువాత రోడ్లపైకి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. ద్విచక్రవాహనదారుల పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది. ఒకవైపు చలి, మరోవైపు ఈదురుగాలులతో వాతావరణం ఒక్కసారిగా మారడంతో ప్రజలు, మరీ ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

ప్రజాసేవతో ఎప్పటికీ గుర్తింపు

దుమ్ముగూడెం, జనవరి 31 : ప్రజాసేవలో ఉండి ప్రజల కోసం పనిచేసిన, చేస్తున్న ప్రజాప్రతినిధులకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. లక్ష్మీపురం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పాలకవర్గానికి బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ప్రజాసేవ అనేది నిరంతర ప్రక్రియ అని, పదవి ఉన్నా...లేకున్నా ప్రజాసేవలో ఉండాలన్నారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పాలకవర్గాన్ని అధికారులతో కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీడీవో ముత్యాలరావు, తహసీల్దార్ చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపహాడ్, జనవరి 31: బూర్గంపహాడ్ మేజర్ పంచాయతీని అభివృద్ధిలో ముందుంచిన సర్పంచ్ సిరిపురం స్వప్న, పాలకవర్గాన్ని ఈవో సమ్మయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో వివేక్‌రామ్, ఎంపీవో సునీల్‌శర్మ, ఏవో శంకర్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి, జనవరి 31: సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆళ్లపల్లి మండలంలోని సర్పంచ్‌లకు మండల ప్రజా పరిషత్ అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ కొమరం హనుమంతరావు, ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ఎంపీడీవో రామారావు, ఎంపీవో శ్రీనివాస్, ఎస్సై రతీస్, వైస్ ఎంపీపీ ఎల్లయ్య, రాఘవాపురం ఎంపీటీసీ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

టేకులపల్లి, జనవరి 31 : మండలలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లను బుధవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలు సహకరించిన ప్రజలకు, సిబ్బందికి, గ్రామ పెద్దలకు, వార్డు సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అశ్వారావుపేట, జనవరి 31 : పాలకవర్గం, కార్యాలయ సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తేనే గ్రామాభివృద్ధి పరుగులు తీస్తుందని ఎంపీడీవో జి. శ్రీనివాసరావు, సర్పంచ్ అట్టం రమ్య అన్నారు. పంచాయతీ పాలకవర్గం ముగియడంతో బుధవారం సర్పంచ్ అట్టం రమ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ ఆదాయ, వ్యయాలు, ఇప్పటివరకు నిర్వహించిన అభివృద్ధి పనులను చదివి వినిపించారు. పాలకవర్గం సభ్యులను శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.

అశ్వారావుపేట టౌన్, జనవరి 30 : గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర గ్రామ సర్పంచ్‌తోపాటు పాలక సభ్యులదేనని, పార్టీలకు అతీతంగా ప్రజాపాలన సాగిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు నడిచారని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మీ, తహసీల్దార్ కృష్ణప్రసాద్ అన్నారు. గ్రామ పంచాయతీ పాలక సభ్యులుగా, సర్పంచ్‌లుగా బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌లతోపాటు ఉత్తమ అధికారులను ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో జి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, ఎంపీవో సీతారామరావు, ఎంపీటీసీలు, ప్రజా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ములకలపల్లి, జనవరి 31 : మండలంలోని తాళ్లపాయ పంచాయతీ సర్పంచ్ బైటి రాజేశ్, ఉపసర్పంచ్‌లను పంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు.

పాల్వంచ రూరల్, జనవరి 31 : కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రాష్ట్రంలో పంచాయతీలు అభివృద్ధి చెందాయని, పట్టాణాలకు దీటుగా మారాయని జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు అన్నారు. సర్పంచుల పదవీ విరమణ కార్యక్రమం బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగింది. జడ్పీటీసీ వాసుదేవరావు, ఎంపీపీ మడి సరస్వతి ఉత్తమ పంచాయతీ తోగ్గూడెం సర్పంచ్ బాదావత్ శాంతిని సన్మానించారు. ఎంపీడీవో అప్పారావు, ఎంపీపీ నారాయణ, ఏపీవో రంగా తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 91 శాతం బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం సింగరేణి, జనవరి 31: సింగరేణి బొగ్గు ఉత్పాదన సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరువలో బొగ్గు ఉత్పత్తిని సాధించి ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నెలాఖరు నాటికి 616,06,613 లక్షల టన్నులకు గాను 560,85,120 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలతోపాటు అధిక వర్షపాతం ఉన్నప్పటికీ అన్ని ఏరియాల జీఎంలు, అదికారులు ఏరియాల్లో ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషిచేశారు.

జనవరిలో లక్ష్యానికి మించి...

రామవరం, జనవరి 31 : కొత్తగూడెం ఏరియా 2023-24 ఆర్థిక సంవత్సరం జనవరి నెలకు కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన 11.19 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 11.55 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 103శాతం లక్ష్యాన్ని సాధించినట్లు జీఎం శాలెంరాజు అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. 2023-24 సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు 103 లక్షల టన్నులకుగాను 112.75 లక్షల టన్నులు ఉత్పిత్తిచేసి 109 శాతం ఉత్పత్తి లక్ష్యం సాధించామని, రోడ్డు, రైల్ ద్వారా 12.96 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు 128.11 లక్షల టన్నుల రవాణా జరిగిందన్నారు. ఎస్‌వోటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ సీహెచ్ రామకృష్ణ, ఏజీఎం కె.హనసుమలత, పర్సనల్ మేనేజర్ బి.శివ కేశవరావు, డీజీఎం ఎన్. మోహన్, ఏజెంట్ పీవీకే 5 ఇంక్లైన్ బి.రవీందర్, ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీరమేశ్, డి.రమణరెడ్డి, ఎంశ్రవణ్ కుమార్, సాగర్ పాల్గొన్నారు.

మణుగూరు టౌన్, జనవరి 31: 2024 జనవరిలో మణుగూరు ఏరియా 82శాతం బొగ్గు ఉత్పత్తి చేసిందని జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. జీఎం కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. జనవరిలో ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 11,18,100 టన్నులకుగాను 9,13,577 సాధించామన్నారు. ఓబీ లక్ష్యం 15లక్షల క్యూబిక్ మీటర్లకుగా ను 15,64,000 తీసినట్లు చెప్పారు. ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, ఇంజినీరు నర్సిరెడ్డి, రక్షణ అధికారి వెంకటరమణ, డీజీఎం(ఐఈడీ) కె.వెంకట్రావు, డీజీఎం(పర్సనల్) రమేశ్ పాల్గొన్నారు.

శుద్ధ జలాలను అందించడమే లక్ష్యం

రామవరం, జనవరి 31: గౌతంఖని ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను కల్పిస్తున్నామని ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు అన్నారు. బుధవారం సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ పంచాయతీ కార్యాలయంలో 4.70 లక్షల వ్యయంతో నిర్మించిన ప్యూరిఫైర్ వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

భద్రాచలం, జనవరి 31 : ప్రజా వ్యతిరేక పాలనను అవలంబిస్తున్న ప్రధాని మోడీని గద్దెదింపేందుకు ఈ నెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని చంద్రరావు భవన్‌లో వ్యవసాయ, కార్మిక సంఘ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఎంబీ నర్సారెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, బండారు శరత్‌బాబు, పారెల్లి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో ముందుండాలి

భద్రాచలం, జనవరి 31 : భద్రాచలంలోని విద్యార్థులు చదువులో ముందుండాలని ఐటీసీ గుత్తేదారు పాకాల దుర్గాప్రసాద్ కోరారు. గిరిజన గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్‌చే అవార్డు అందుకోవడం ప్రశంసనీయమని అన్నారు. కళాశాలలో ప్రిన్సిపల్‌ను బుధవారం సత్కరించి మాట్లాడారు. రొటేరియన్ అజీమ్, వైస్ ప్రిన్సిపాల్ బసవకుమారి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

చెక్కు ఇస్తున్న మల్లాది వెంకట సుబ్రహ్మణ్య విజయకృష్ణ

భద్రాచలం, జనవరి 31 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన పథకానికి హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన మల్లాది వెంకట సుబ్రహ్మణ్య విజయకృష్ణ, దేవస్థానం అధికారి లింగాల సాయిబాబాకు రూ. లక్ష చెక్కును బుధవారం అందజేశారు. తొలుత ఆయన అంతరాలయంలో మూలమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. దాతను ఆలయ అధికారులు సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

గంజాయి పట్టివేత

జూలూరుపాడు, జనవరి 31 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట పోలీసులు బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి పట్టుబడింది. ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న సుమారు 20 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న భద్రాచలం డిపోకు చెందిన బస్సు డిక్కీలో రెండు బ్యాగుల్లో పెట్టిన గంజాయిని గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బూర్గంపహాడ్, జనవరి 31: వాహన తనిఖీల్లో 25 కిలోల గంజాయి పట్టుకున్నారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మణుగూరు క్రాస్‌రోడ్‌లో ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టగా పోలీసులను చూసి పారిపోతున్న కారు, ఓ ద్విచక్రవాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయితో పాటు కారు, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత

అశ్వారావుపేట టౌన్, జనవరి 31 : మన చుట్టూ నివసించే జంతువులను సంరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని, జంతువుల సంక్షేమం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని పశుసంవర్ధకశాఖ ఏరియా సహాయ సంచాలకులు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక జిల్లాపరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పశువైద్యాధికారి డాక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

చండ్రుగొండ, జనవరి 31 : ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం పట్టభద్రులు ఫిబ్రవరి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సాజియాసుల్తానా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఓటరు దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, ఓటరు కార్డు జిరాక్సు, డిగ్రీ ప్రోవిజినల్ ఒరిజినల్ సరిఫికెట్‌ను వెంట తీసుకురావాలన్నారు. దరఖాస్తుకు పాస్‌పోటో అతికించి ఇవ్వాలన్నారు.

పంట నమోదు తనిఖీ

దమ్మపేట రూరల్, జనవరి 31: ఏఈవోలు నమోదు చేసిన పంటలను జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు బుధవారం తనిఖీ చేశారు. ఎరువు దుకాణాలను ఏడీఏ అజ్జల్ బేగం, ఏవో చంద్రశేఖర్ రెడ్డి తనిఖీ చేశారు. జిల్లా ప్రత్యేక సాంకేతికాధికారి సాయి నారాయణ, ఏఈవోలు దీప్తి, వినోద్‌కుమార్, అనుబాబు, రవీంద్రరావు పాల్గొన్నారు.

కేవోసీ పీవోకి సమ్మె నోటీస్

టేకులపల్లి, జనవరి 31 : సింగరేణి కోయగూడెం ఉపరితల గనిలో కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా పీవో ప్రహ్లాద్‌కు, ఎల్ఎస్ఎన్ ఓబీ యాజమాన్యం రాజమోహన్‌రెడ్డికి బుధవారం సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో యాకుబ్ షావలి, గుగులోత్ రాంచందర్, డి.ప్రసాద్, కుంజ రమేశ్, నెల్లూరి నాగేశ్వరరావు, పాయం వెంకన్న, రాయన్ల కోటిలింగం, రాజ్‌కుమార్, సైదులు, శేఖర్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా... కూలీలకు తీవ్ర గాయాలు

కరకగూడెం, జనవరి 31 : కూలీలతో వెళ్తున్న ఓ ఆటో బోల్తాపడిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకున్నది. గ్రామస్తులు, క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం... తుమ్మలగూడెం, అనంతారం గ్రామాలకు చెందిన సుమారు 8 మంది కూలీలు పద్మాపురం వైపు వరినాట్లు వేసేందుకు ఆటోలో వస్తున్న క్రమంలో అనంతారం గ్రామశివారుకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అటోలో ప్రయాణిస్తున్న కూలీలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు క్షతగాత్రులను వేరే ఆటోలో కరకగూడెం పీహెచ్‌సీలో వైద్యులు వారికి ప్రథమచికిత్స అందించి 108లో మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సారపాకలో ఎన్నిక జరిగేనా..?

సారపాక, జనవరి 31: పారిశ్రామికవాడ అయినా సారపాకలో ఈసారైనా పంచాయతీ ఎన్నికలు జరిగేనా..? అని పంచాయతీ ప్రజలు ఎదురుచూస్తున్నారు. 2019లో నాటి సర్కార్ పంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తుందనే ప్రచారం జరిగింది. కానీ తర్వాత ఆ కల నెరవేరలేదు. దీంతో ఒకవైపు పంచాయతీ ఎన్నికలు జరగక, పాలకవర్గం లేక అధికారుల పాలనలో గ్రామ అభివృద్ధి కుంటుపడిందని స్థానికుల ఆరోపణ. ప్రస్తుతం రాష్ట్రంలో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం బుధవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది. ఈ తరుణంలో సారపాకలో ఎన్నికలు జరుగుతాయని ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ అంశంపై సర్కార్ జోక్యం చేసుకోవాలని కోరుతూ ఇప్పటికే గ్రామస్తులు హైకోర్టును సైతం ఆశ్రయించారు. ఎన్నిక విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు నాటి ప్రభుత్వాన్ని ఆదేశించింది. కానీ అందుకు తగిన విధంగా అడుగులు కాలేదు. తర్వాత కొన్ని నెలల తర్వాత గ్రామాన్ని రెండు పంచాయతీలుగా విభజించాలని సర్కార్ నిర్ణయంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన రహదారికి ఒక వైపు ఉన్న ప్రాంతాన్ని సారపాక అని, మరోవైపు ఉన్న ప్రాంతాన్ని ఐటీసీ పంచాయతీ అని ప్రకటించింది. ఇక ఎన్నిక సంగతి ఏ దరికి చేరుతుందో వేచి చూడాల్సిందే.

సారపాక పంచాయతీ కార్యాలయం

పాలకవర్గం లేకుండానే..

పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో 40 వేలకు పైగా జనాభా ఉంది. పారిశ్రామికంగా ముందంజలో ఉండి అన్నిరకాల ఉద్యోగ, వ్యాపార సముదాయంగా నిలిచింది. పెద్ద పంచాయతీ అయినప్పటికీ ఐదేళ్లుగా పాలకవర్గమే లేదు. అధికారుల పాలనే కొనసాగుతుంది. పాలకవర్గం లేకపోవడంతో అనుకున్న స్థాయిలో పంచాయతీ అభివృద్ధి జరగడం లేదనే అభిప్రాయం ప్రజల్లో తీవ్రంగా ఉంది. ఎన్నికలు నిర్వహించి ప్రజాప్రతినిధుల పాలన తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమాజ సేవలో ముందుండాలి

గుండాల, జనవరి 31: ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తూ సమాజ సేవలో వాసవి క్లబ్ ముందుండాలని వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ గవర్నర్ పొలిశెట్టి శివకుమార్ అన్నారు. బుధవారం నిర్వహించిన వాసవి క్లబ్ గ్రీన్‌ఫీల్డ్ నూతన క్లబ్ పదవి ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లును సన్మానించారు. బాధ్యులు అనుముల వెంకటేశ్వరరావు, పుల్లఖండం ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సంక్షేమ సమితి వార్షికోత్సవం

సారపాక, జనవరి 31: బూర్గంపహాడ్‌లో యాసిన్ మసీద్‌లో ముస్లిం మైనార్టీ సంక్షేమ సమితి 5వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహిమూద్ ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్షుడిగా మరోమారు కరకగూడెం మండలానికి చెందిన సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్‌ను నియమించినట్లు తెలిపారు. భద్రాచలం మండల అధ్యక్షుడిగా ఎండి.బాలాజీ నియమితులయ్యారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

దుమ్ముగూడెం, జనవరి 31: పరీక్షల పట్ల విద్యార్థులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రణాళిక ప్రకారం అన్ని సబ్జెక్టులను బాగా చదవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు సూచించారు. ప్రాక్టికల్, థియరీ ఎగ్జామ్స్‌పై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానకు కుర్చీలు అందజేత

చుంచుపల్లి, జనవరి 31 : ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచి సెక్రటరీ, వైస్ ఎంపీపీ వట్టికొండ మల్లికార్జున్ తన సతీమణి రజిని జ్ఞాపకార్థం గౌతంపూర్ పంచాయతీలోని పల్లె దవాఖానకు బుధవారం కుర్చీలు, టేబుళ్లను అందించారు. సర్పంచ్ పొడియం సుజాత, కార్యదర్శి, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

కొత్తగూడెం సింగరేణి, జనవరి 31 : సింగరేణి సంస్థ పర్సనల్ మేనేజ్‌మెంట్ విభాగంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్.రమేశ్‌ను పర్సనల్ జీఎంలు బసవయ్య, హనుమంతరావు, కవితా నాయుడు బుధవారం సన్మానించారు. ఏజీఎం పర్సనల్ కే.శ్రీనివాసరావు, డీజీఎం పర్సనల్‌లు అజయ్‌కుమార్, వరప్రసాద్, వైవీఎల్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామవరం, జనవరి 31 : సింగరేణి కొత్తగూడెం ఏరియా పీవీకే గని ఆవరణలో బీ రిలే కోల్ కట్టర్స్ ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ రీజినల్ సెక్రటరీ కూసన వీరభద్రయ్య, సత్యనారాయణ కోల్ కట్టర్, హరిసింగ్ కోల్ కట్టర్‌ను గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ బుధవారం సన్మానించారు. గని అండర్ మేనేజర్లు అరుణ్, శ్రావణ్, అంకెం రాజయ్య, ఏఎస్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఆరె రాజయ్య పాల్గొన్నారు.

పంప్ ఆపరేటర్లకు ప్రమోషన్ ఇవ్వాలి

కొత్తగూడెం సింగరేణి, జనవరి 31: సివిల్ డిపార్ట్‌మెంట్‌లో యాక్టింగ్ పంప్ ఆపరేటర్లుగా పని చేస్తున్న జనరల్ మజ్దూర్లకు ప్రమోషన్ ఇవ్వాలని జీఎం పర్సనల్ హన్మంతరావుకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వినతిపత్రమిచ్చారు. మందా నరసింహారావు, విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు ప్రారంభం

పర్ణశాల, జనవరి 31 : పర్ణశాల పంచాయతీలో రెండు పాఠశాలలు, నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు రూ.20లక్షలు కేటాయించగా ఆ పనులను సర్పంచ్ వరలక్ష్మి బుధవారం ప్రారంభించారు. గోవిందాపురం, సీతానగరం, ముసలిమడుగు, పర్ణశాల గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పనులను ప్రారంభించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

కావలెను

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి

పర్వతనేని వీరయ్య S/o. (లేటు) రాములు, నివాసం : ఇ.నెం. 2-5-588/8/1, P.C.K. తోట, ఖమ్మం-త్రీ టౌన్, ఖమ్మం జిల్లా అను నేను పిల్లి చిన్న క్రిస్టు తోట నుండి గాంధీచౌక్ ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ (డాక్యుమెంట్ నెం. 721/1994) పోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
Cell: 7036549277

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టై